కాలిబాట వంతెన పనులు వేగవంతం

- బస్టాండ్ రోడ్డు నుంచి నరసాపురం – నిడదవోలు కాలువపై కాలిబాట వంతెన
- కాటన్ పార్కు అభివృద్ధికి ముందడుగు


కాటన్‌పార్కుకు చేరుకోవడానికి పంటకాలువపై బస్టాండ్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు వేగంగా సాగుతున్న దృశ్యం

నరసాపురం: కాటన్ పార్కును ఇటీవల కాలంలో బాగా అభివృద్ధి చేశారు. రూ 48.26 లక్షలు 14వ ఆర్థికసంఘ నిధులతో పార్కులో సుందరీకరణ పనులు దాదాపుగా పూర్తి చేశారు. ఇప్పుడు పార్కుకు వచ్చే వారి సంఖ్య మరింత పెంచడానికి బస్టాండ్ ఎదురుగా ఉన్న 216 జాతీయ రహదారి పక్కనున్న పంట కాలువపై రూ 19.50 లక్షలతో కాలిబాట వంతెన పనులు చేపట్టారు. మొన్న కరాలు వలు కట్టేసిన తరువాత ప్రారంభమైన వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయి. వంతెన పనులు మరికొన్ని రోజుల్లో పూర్తి కానున్నాయి. ఇప్పుడు బస్టాండ్, మెయిన్ రోడ్డు నుంచి కాటన్ పార్కుకు నేరుగా చేరుకునే వీలుంది. దీంతో కాటన్‌పార్కుకు వచ్చే సందర్శకుల సంఖ్య కూడా భారీగా పెరుగుతుంది. అంతేకాకుండా కాటన్ పార్కు వద్దే ప్రథమ శ్రేణి గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నారు. గ్రంథాలయ సొంత భవనం పనులు కూడా ఓ పక్క చురుగ్గా సాగుతున్నాయి. దీంతో ఈ కాలిబాట వంతెన నుంచి గ్రంథాలయానికి కూడా చుట్టుతిరిగి వెళ్లాల్సిన అవసరం లేకుండా చేరుకోవచ్చు.

ఆకర్షణీయంగా పార్కు అభివృద్ధి

బస్టాండ్, మెయిన్‌రోడ్డు ప్రాంతం నుంచి చూస్తే పార్కు ఆకర్షణీయంగా కనిపించేలా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవతో కాలిబాట వంతెన నిర్మాణం మున్సిపాలిటీ పూర్తి చేస్తుంది. పార్కును 13, 14వ ఆర్థికసంఘం నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. రూ 12.50 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌లో ఆట వస్తువులు, టాయిలెట్స్ నిర్మిస్తున్నారు. రూ.9.39 లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులతో మొక్కలు, బ్యూటిఫికేషన్ వర్క్ చేస్తున్నారు. మరో రూ 11.73 లక్షలు 15వ ఆర్థికసంఘ నిధులతో పార్కులో ప్లాట్‌ఫామ్ మొత్తం ఆధునికీకరిస్తున్నారు. రూ 19.50 లక్షలు మున్సిపల్ జనరల్‌ఫండ్స్‌తో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. పార్కు మరింత అభివృద్ధిలో భాగంగా బస్టాండ్ ఎదురుగా ఉన్న 216 జాతీయ రహదారి నుంచి నేరుగా పార్కుకు చేరుకోవడానికి నిడదవోలు–నరసాపురం కాలువపై కాలిబాట వంతెన నిర్మిస్తున్నారు.

మారుతున్న పార్కు రూపురేఖలు



కాటన్‌పార్కు అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. గత పాలకులు పార్కు అభివృద్ధికి రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. దీంతో పార్కు శిథిలమై మూతపడింది. మా హయాంలో పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆర్థికసంఘం నిధులు కేటాయించారు. మున్సిపల్ జనరల్ ఫండ్స్ కూడా ఖర్చుచేసి కాటన్ పార్కును అభివృద్ధి చేస్తున్నాం. పంటకాలువపై కాలిబాట వంతెన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పార్కు రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని సబ్ కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని సబ్‌కలెక్టర్, ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందించాలని కోరారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్–1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో ఆదివారం పిల్లలు చేత పుస్తక పఠనం చేయించారు. తరువాత కథలు చెప్పడం, యోగా, లెక్కల సబ్జెక్ట్‌లో మెళకువలు చేర్పించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని విద్యార్థుర్థులు సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. ఈ నెల 11 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. రిటైర్డ్ సైంటిస్ట్ ఆర్.సుబ్బారావు, మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు, సుధీర్‌మోహన్, సూర్యం బాబు, భట్టిప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో వేంచేసియున్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుండి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు, సిబ్బంది క్యూలైన్లు ఏర్పాటు చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలు


పెనుగొండలో ఎస్పీ బాలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

పెనుగొండ: మధుర గానంతో అంతర్జాతీయ కీర్తిని సముపార్జించిన ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం గాన గంధర్వుడని పెనుగొండ సచివాలయ కార్యదర్శి సీహెచ్ వెంకట రాజ్యలక్ష్మీ అన్నారు. ఆదివారం ఎస్పీ బాలు జయంతిని పెనుగొండలో ఎస్పీ బాలు అభిమానులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. కార్యక్రమంలో పాచర్ల సత్యనారాయణ, ఆశా వర్కర్లు, సంగీత ప్రియులు పాల్గొన్నారు.

నరసింహునికి చక్రస్నానం


కొంతేరులో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు పూలపల్లి వేణునాథ్

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ఆధ్వర్యంలో అర్చకులు మాధవాచార్యులు చక్రస్నానం చేయించారు. అనంతరం దేవేరులకు మంగళవాయిద్యాలు, బాణాసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి పుష్పయాగం అనంతరం మహిళ భక్తులకు పసుపు, కుంకుమ, ప్రసాద వితరణ చేశారు. ఈ నెల 11వ తేదీ ఆదివారం గ్రామస్తులు, భక్తుల సహకారంతో అఖండ అన్నసమారాధన నిర్వహించడంతో ఈ ఏడాది వార్షిక కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాస్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు అల్లూరి సత్యనారాయణ సాంస్కృతిక కేంద్రం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరు యువతులు ఉన్నట్టు టౌన్‌ఎస్సై ప్రసాద్ తెలిపారు. గోదావరి గట్టు రోడ్డులో రేవులో బెనర్జీ అనే వ్యక్తి ధరణీ లలిత, దీప్తి అనే ఇద్దరు యువతులను ఎక్కించుకుని పంటు రేవువైపు వస్తుండగా, అల్లూరి కల్యాణ మండపం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం వారిని భీమవరం తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లిపోయారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

నేడు కొవ్వాడ పుంతలో అభివృద్ధి పనుల ప్రారంభం

భీమవరం అర్బన్: మండలంలోని కొవ్వాడ పుంత గ్రామంలో సోమవారం మూడు అంతర్గత సీసీ రోడ్లను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించనున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుమాని ఏడుకొండలు ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి

భీమవరం (ప్రకాశంచౌక్): సాధారణ వ్యాధులు, మహిళల ఆరోగ్య సమస్యలకు సంబంధించి ప్రతి రోజు సాయంత్రం మెంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం) లో వైద్య సేవలను అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అలాగే ప్రతి మంగళవారం ఉదయం గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి గుండె వైద్య నిపుణులు సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, ఎకో వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.

మానవత ఆధ్వర్యంలో ముగిసిన వేసవి శిక్షణ

పెనుమంత్ర: మండల మానవత స్వచ్ఛందసేవాసంస్థ ఆధ్వర్యంలో మార్టేరులోని శ్రీ వేణుగోపాల ఉన్నతపాఠశాల ఆవరణలో నెలరోజుల పాటు నిర్వహించిన వేసవిశిక్షణా శిబిరంలో ఆదివారం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. మానవత సంస్థ అధ్యక్షులు చిర్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈ కోచింగ్ క్యాంపులో పాల్గొని వివిధ ఈవెంట్లలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కోచింగ్ క్యాంపులో యోగా, కూచిపూడి, సంగీతం, గీతా శ్లోకాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మానవతా సంస్థ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధాపుష్ప మాట్లాడుతూ వేసవి సెలవులలో విద్యార్థులు దురలవాట్లకు లోనుకాకుండా సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని ఆమె అన్నారు. మరో ముఖ్య అతిథి మానవత సంస్థ జిల్లా కన్వీనర్ పెనుమంత్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి శిక్షణను ఇవ్వడం అభినందనీయమని ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవగలవని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులు వేదికపై ప్రదర్శనలు ఇచ్చి సభకు హాజరైన పలువురు తల్లిదండ్రులను ఆకర్షించి అభినందనలందుకున్నారు. ఈ సందర్భంగా గీతా శ్లోకాలు, యోగా,చెస్, కుంగ్‌ఫూ, చిత్రలేఖనం పోటీలలో ప్రథమ స్థానాలు పొందిన కె.జస్మిత, టి.సహస్ర, కె.శ్రీనివాసరెడ్డి, పి.శ్రీనిధి, కె.రోహిత్, ఎస్.రామసాత్విక్, ఎస్.గాయత్రితనీషాలకు ప్రశంసా పత్రాలను, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మార్టేరు, నెగ్గిపూడి ఎంపీటీసీ సభ్యులు కర్రి అనూరాధ, పెనుగొండ లక్ష్మి, మార్టేరు ఉపసర్పంచ్ కర్రి వేణుబాబు, వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వెలగల చైతన్య ప్రసాద్‌రెడ్డి, రిటైర్డ్ తహసిల్దార్ చిర్ల సూర్యనారాయణరెడ్డి, కొత్త సత్యనారాయణమూర్తి, మానవతా అధ్యక్షులు చిర్ల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు,శ్రీనివాసుల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏరువాక పౌర్ణమి పూజలు


గుంపర్రులో జ్యేష్ట పౌర్ణమికి ఏరువాక పూజలు చేస్తున్న రైతులు

యలమంచిలి: జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా ఆదివారం గుంపర్రు గ్రామంలో రైతులు ఏరువాక పూజలు చేశారు. ప్రతి ఏడాది జ్యేష్ఠ మాసంలో వచ్చే పౌర్ణమికి రైతులు ఏరువాక పూజలు చేయడం ఆనవాయితీ. వేసవి ఎండలు తగ్గి తొలకరి జల్లులు పడే సమయంలో వరి సేద్యంలో ప్రధానమైన వరి విత్తనాలు వేయడానికి ముందు చేనును నాగలితో దున్నడమే ఏరువాక. వరి సేద్యంలో పాడి పశువుల ప్రాధాన్యత కూడా ఎక్కువ కాబట్టి ఈ రోజు పశువులకు శుభ్రంగా స్నానం చేయించి వాటి గిట్లకు పసుపు కుంకుమలు పూసి పూజలు చేస్తారు. అలాగే బెల్లం, బియ్యం, ఆవు పాలతో పులగం వండి పశువులకు పెడతారు. ఈ ఏడాదిలో వచ్చే సార్వా, దాళ్వా పంటలు సక్రమంగా పండి రైతులకు అధిక లాభాలను చేకూర్చాలని ప్రకృతిని వేడుకుంటూ ఈ పూజలు చేస్తారు. ఆ విధంగా రైతులు ఆదివారం గుంపర్రు గ్రామంలో వరిచేల్లో ఏరువాక పూజలు చేసి పశువులకు పులగం వండి పెట్టారు. కార్యక్రమంలో రైతులు జడ్డు బదరీనారాయణ, రంగారావు, ఉలసి సత్తిబాబు, ఉలసి ఏసుబాబు, నాగులు, విష్ణుమూర్తి, పితాని కోటేశ్వర రావు, ఎం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనకొండాలమ్మ జాతర


ధనకొండాలమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి: అడవిపాలెం, మేడపాడు, పెనుమదం, కొంతేరు గ్రామాల సరిహద్దులో వరి చేల మధ్యలో పాలకొలను సర్వేశలింగం పొలంలో వెలసిన ధనకొండాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, మంగళ వాయిద్యాల నడుమ గరగల నృత్యాలతో అమ్మవారికి గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా అమ్మవారికి కుంభం పోశారు. అనంతరం ఊయల ఉత్సవం చేసి అమ్మవారి ఘటాలను ఆలయ ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది. నాలుగు గ్రామాలకు చెందిన రైతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరలో నాలుగు గ్రామాలతోపాటు పరిసర గ్రామాలకు చెందిన పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో జాతరకు వచ్చిన భక్తులందరికీ మాంసాహారంతో భోజనాలు ఏర్పాటు చేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేసే వరకు ఆందోళన ఆపేది లేదని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు అన్నారు. ఇచ్ఛాపురం నుంచి ప్రారంభించిన ప్రచార యాత్రలో భాగంగా ఆదివారం భీమవరం చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్టు కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు కుమార్, టీ నూకరాజు, ధనాల వెంకటరావు పాల్గొన్నారు.

జగనన్న భూసర్వేతో సమస్యలకు పరిష్కారం


కొడమంచిలిలో డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుగొండ: జగనన్న భూ సర్వేతో ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న రైతన్నల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం అన్నారు. ఆదివారం కొడమంచిలిలోని ఉన్నత పాఠశాల వద్ద ఏరియల్ సర్వే ప్రారంభించారు. రెవెన్యూ వ్యవస్థలోనే ఎపుడూ లేని విధంగా కొత్త ఒరవడిని సృష్టించి ప్రతీ రైతు సమస్య తీర్చడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగుతుందన్నారు. రైతు సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, దేవస్థానం చైర్మన్ బాలనాగు నరేష్, డీటీ లక్ష్మి, ఆచంట సీతారామ్, కె.నర్సింహరాజు, చలం, సూర్యనారాయణ, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యప్రదర్శనలు


శిల్పారామంలో ప్రదర్శనలు ఇస్తున్న దామెర్ల కనక విజయలక్ష్మి శిష్యులు

నరసాపురం: తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ, రాధికా సంగీత నృత్య అకాడమీ సంయుక్తంగా హైదరాబాద్ శిల్పారామంలో నిర్వహించిన నృత్య పోటీల్లో నరసాపురం శ్రీ నటరాణి నృత్య అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. అకాడమీ డైరెక్టర్, నాట్యాచారిణి ఆధ్వర్యంలో ఆమె శిష్యులు యామిని సరస్వతి, ఆనందిత, నేహా, సుమేధ, మానస, చరణి, దక్షిత, చరణ్య తదితరులు శనివారం ఇచ్చిన ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కూచిపూడి నృత్యాలతో అలరించిన విద్యార్థులను తెలంగాణా భాషా సాంస్కృతికశాఖ అధికారులు, అతిథులు అభినందించారు. నిర్వాహకులు విద్యార్థులకు షీల్డ్‌లు, సర్టిఫికెట్‌లు అందించారు.

సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టడం అన్యాయం


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం

వీరవాసరం: భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టడం అన్యాయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం తీవ్రంగా ఖండించారు. వీరవాసరంలో పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జన సైనికుడు బందారు మణికంఠ సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తూ దాడులకు పాల్పడుతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్లో జనసేన నాయకుడు కొటికలపూడి గోవిందరావు బీసీలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం చాలా దారుణం అన్నారు. బీసీలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తీవ్రంగా హెచ్చరించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి సాధిస్తున్నామని తెలిపారు. ఫ్లెక్సీలు చింపడం, అల్లర్లకు పూనుకోవడం, దాడులకు పురిగొల్పడం చేస్తున్న జన సైనికులు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని తీవ్రంగా హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండల చైర్మన్ గొలగాని సత్యనారాయణ, తోకలపూడి సర్పంచ్ వీరవల్లి శ్రీనివాసరావు, పాల లక్ష్మీ కుమారి, వీరవల్లి కనకమహాలక్ష్మి, బోను జ్యోష్ణ దేవి, నూకల కనకారావు, వీరవల్లి రాధాకృష్ణ, డీవీడీ ప్రసాద్, మత్ర కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు మేలైన వైద్యసేవలే లక్ష్యం


మొగల్లులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పీవీఎల్

పాలకోడేరు: అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మోగల్లులోని సచివాలయం–2 పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు అని, ఆ లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. గ్రామస్థాయిలో ప్రాథమిక వైద్య సేవలను మెరుగుపరచాలనే ఉద్దేశంతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. రూ.17.50 లక్షల వ్యయంతో ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు నెలాఖరుకల్లా భవన నిర్మాణ పూర్తయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇప్పటికే సచివాలయం–1 పరిధిలో భవన నిర్మాణం తుది దశకు చేరుకుందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ప్రజలకు నిరంతరం సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కాటూరి శాంత కుమారి, పెన్మత్స వెంకటలక్ష్మి, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు (బాబు) పెన్మత్స నాగరామకృష్ణంరాజు, మంతెన బాపిరాజు, ఉప సర్పంచ్ పెన్మత్స సీతారామరాజు, బలే చిట్టిబాబు, సైదు శివలింగేశ్వరరావు, జి.సత్య కృష్ణ, వీరమల్లు అశోక్, గోడి భూషణం, కోరుకొల్లు దాసు, కడిమి కుమార్, కొత్రకూటి కొండ, పంపన శ్రీను, మద్దుల మౌళి, గొడవర్తి వెంకటేశ్వరరావు, సకినేటిపల్లి మాణిక్యాలరావు, కాంట్రాక్టర్ గొడవర్తి వాసు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై చెత్త నిల్వలు లేకుండా చూడాలి

తణుకు అర్బన్: రహదారులపై చెత్త నిల్వలు లేకుండా అధికారయంత్రాంగం కృషి చేయాలని నరసాపురం సబ్ కలెక్టర్, తణుకు మునిసిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ సూర్యతేజ అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాలను ఆదివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రహదారులపై ఉన్న చెత్తాచెదారాలు, డ్రైయినేజీల్లో పూడిక నిండి ఉండడాన్ని గుర్తించి వెంటనే శుభ్రపరచాలని మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్‌ను ఫోన్ ద్వారా ఆదేశించారు. చెత్త, వ్యర్థాలను రహదారులపై నిల్వ ఉండడం వల్ల పలు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మళ్లీ ఇదే ప్రాంతాలపై తన పర్యవేక్షణ ఉంటుందని వ్యర్థాలతోపాటు పూడికతీత పనులను పూర్తి చేయాలని సూచించారు.

12 నుంచి అమ్మవార్ల ఆషాడ మాస జాతర


శ్రీమావుళ్లమ్మ దర్శించుకుంటున్న భక్తులు

వీరవాసరం: రాయకుదురులో వేంచేసి ఉన్న శ్రీమావుళ్ళమ్మ, మహాలక్ష్మి, పోతురాజు స్వామి వార్ల ఆషాడమాస జాతర మహోత్సవాలు ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తామని అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ మంతెన వరప్రసాద్ చెప్పారు. శ్రీ మావుళ్ళమ్మ మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. 12న అమ్మవార్లను దేవాలయం నుంచి తీసుకువచ్చి పూరి గుడిసెలో పెట్టడం జరుగుతుంది. 16న గమల్ల గుడుపు, 17న మేళతాళాలతో బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల గరగోత్సవం, 18న గ్రామం నుంచి అమ్మవార్లను ఆలయంలోనికి పునఃప్రవేశం జరుగుతుందని వివరించారు. ముందుగా శ్రీమావుళ్లమ్మ, మహాలక్ష్మి, పోతురాజు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం భారతి, వెంకటేశ్వరరావు, గడ్డం భాస్కరరావు, ఏలూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.

చినమావుళ్లమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం 36వ వార్డు రామరాజు తోటలో వేంచేసియున్న శ్రీచినమావుళ్ల అమ్మవారి 38 వార్షిక మహోత్సవ జాతరను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలన్నారు. అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలను ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా అమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. అమ్మవారి జాతరలో పలు కళాప్రదర్శనలు, తీన్‌మార్, సన్నాయి వాయిద్యాలు, అసాదుల నృత్యాలు భక్తులను అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్ రాజు, గాదిరాజు తాతారాజు, మావూరి సుందరరావు, చింతాడ శ్రీను, అమ్మవారి సేవా సమితి అధ్యక్షులు రామాయణం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రేవూరి గోగురాజు, సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రైస్ కార్డులో మార్పులు చేర్పులకు అవకాశం

ఉండి: రైస్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ వరకు కల్పించిందని, దీనిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఏవీ అప్పారావు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వివిధ కారణలతో రైస్ కార్డు నుంచి తొలగించిన వారు లేదా కొత్తగా కార్డులో నమోదు కావాల్సిన వారికి ప్రస్తుతం సచివాలయాల్లో పేర్ల నమోదు జరుగుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఒంటరి వ్యక్తులకు రైస్ కార్డు మంజూరు చేయనున్నారన్నారు. అలాగే రైస్ కార్డులో కొత్తగా పేరు చేర్చేవారి ఆధార్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌ను అందించాల్సి ఉంటుందన్నారు. అలాగే కార్డు, కార్డులోని వ్యక్తుల బదిలీ కొరకు ప్రస్తుతం అవకాశం ఉందన్నారు. కొత్త రైస్ కార్డు కొరకు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.